## బహుమతి పొందిన చిట్టికథ

"ఏమండీ! ఈరోజు మీకిష్టమైనవి చేశాను చెప్పుకోండి చూద్దాం!" అంది భర్త కామేశ్వర్రావుతో రామేశ్వరి.

"అయితే జంతికలు... కాకపోతే చంద్రకాంతలు" అ రెండే యిష్టం కాబట్టీ అవే చెప్పాడు.

పక పక నవ్వింది రామేశ్వరి. కామేశ్వర్రావు విస్తుబోయాడు.

"మీకెప్పుడూ తిండి మీదే దృష్టి! నే చేసింది మీ పాత చొక్కాలన్నింటికీ బొత్తాములు కుట్టాను. నేనే వుతికి ఇస్త్రీలు చేసాను. ఇల్లంతా అందంగా తీర్చిదిద్దాను" తను చేసిన ఘన కార్యాలన్నింటినీ వల్లించేసిందామె.

సహజంగా కామేశ్వర్రావు కడు జాగ్రత్తయిన మనిషి. దేన్నీ పొల్లు పోనివ్వడు. ప్రతీ పని సొంతంగా చేసుకోవడమే యోగ్యమంటాడు. పొదుపు పాటించాలని హెచ్చరిస్తాడు. కానీ వీటి అన్నింటికీ వ్యతిరేకంగా వుంటుంది రామేశ్వరి.

గుండీలు వూడిపోయినా—చిన్న చిరుగు పడినా వాటిని ఏ పాత్రల వాడికో పడేసి కొత్తవి కొనుక్కోవచ్చు




కదా అంటుంది.

అయితే ఈనాడు మాత్రం ముఖం నిండా నవ్వులు విరబోయించుకుని ఎదురొచ్చి మరీ ఇష్టమైనట్లుగా ప్రవర్తించి చెప్పిందంటే కామేశ్వర్రావు తెల్లబోవటమే కాక ఇందులో ఏదో అంతరార్థం వుందనే భావించాడు.

"నువ్వివన్నీ దేనికోసం చేశావో నాకు అర్థం అయింది" అన్నాడు క్షుణ్ణంగా భార్య వదనంలోని భావాలు చదివాక.

"మీరు పోలుస్తారని నాకు తెలుసు కానీ—న ధర్మంగా కోరిక చెప్పాలిగా—చెబుతున్నా! చాలా కాలంగా నాకు పుట్టింటికి వెళ్లాలనుందండీ. మా బామ్మకి నేనంటే ప్రాణం. ఆమె రేపో మాపో 'హరీ' అంటుంది. ఈ కొన కాలంలోనే కదా ఆమె మొహం ఓసారయినా చూసేది. ఇంక అవివాహితులయిన మా చెల్లెళ్లతో సర్దాగా కాలక్షేపం చేసేది ఇప్పుడే కదా! తర్వాత వాళ్లకి పెళ్లిళ్లయి, సంసారాల్లో పడ్డాక మరి ఎలానూ కుదర్దు. మీరేమంటారు?" అని భర్త మనసులో ఏ భావం వుందో—అతని కనుల్లో గాని ప్రతిబింబిస్తుందేమోనని ఎదురు చూడసాగింది రామేశ్వరి.

"ఏమంటాను! ససేమిరా వెళ్లవద్దంటాను! నువ్వు పుట్టింట్లో పోచుకోలు కబుర్లాడుకుంటుంటే నాకిక్కడ వండి పెట్టేదెవరని? నీ బాబుగారనుకున్నావా!" గయ్యిన ఎగిరాడు కామేశ్వర్రావు.

"ఏమండీ ప్లీజ్! దీపావళి నెల్లాళ్లుంది... ఈ దీపావళి పండుగ అక్కడే జరుపుకుంటాను. పోనీ సెలవు పెట్టి మీరూరండి. లేదా నన్నైనా పంపండి" అని బ్రతిమిలాడటంలో మోతాదు పెంచింది.

కానీ కామేశ్వర్రావుకి గుండెకరగలేదు. అసలే డబ్బుకీ అతనికీ లంకె. ఆమెని పుట్టింటికి పంపితే కనీసం ఖర్చు అయిదొందలు. అందునా ఈనెల్లో ఇర్రెగ్యులర్ పేమెంట్ వల్ల రికవరీ కూడా మొదలైంది.

ఇలా అనుకున్నదే తడవుగా చికాగ్గా మొహం పెట్టాడు. తనకి సుతరామూ ఇష్టం లేదని చెప్పాడు.

ఎంతో ప్రాధేయపడింది రామేశ్వరి.

తన మెడలో గొలుసు తాకట్టు పెట్టయినా అప్పుతెమ్మంది. తరువాత పుట్టింటి నుండి తండ్రిని అడిగి డబ్బు తెచ్చాక విడిపించుకోవచ్చన్నది.

అంత అగత్యం లేదన్నాడు కామేశ్వర్రావు.

అతని పుడుంపట్టు ఫలితంగా ఎడ మొహం పెడ మొహం అయింది.

వారం రోజులు అట్లాగే గడిచాయి.

ఓ రోజు సాయంత్రం కామేశ్వర్రావు ఆఫీసు నుండి యింటికి తిరిగి వచ్చేసరికి-ఇల్లంతా పెళ్లివారి హడావుడిలా అనిపించింది.

గుమ్మంలో అడుగు పెట్టాడోలేదో—మూర్ఛవచ్చినంత పనయింది. అతని అత్తమామలు—మరదళ్లు—వదినగార్లు—బామ్మ... ఆమె చుట్టూ పిల్లలు... మొత్తం ఓ డజను మంది దాకా సాక్షాత్కరించారు.

వారినందర్నీ చూసి నవ్వలేక నవ్వి పలుకరించాడు. మెల్లగా భార్యని లోనికి రావలసిందిగా సొంజ్ఞ చేసాడు.

"ఇంత హఠాత్తుగా మీ మేళం దిగిందేం?" అక్కసుగా ప్రశ్నించాడు గదిలోకి చేరాక.

"మరి నేను పుట్టింటికి వెళ్తానంటే వద్దన్నారాయె! అందుకే మా వారందర్నీ చూడాలనుందని ఓ నెలపాటుండేలా రమ్మని—సర్దాగా గడపవచ్చని రాశాను. పావం నామాట మీద గౌరవం వుంచారు" అని చెప్పి గబగబ వెళ్లిపోయింది రామేశ్వరి.

తను భార్యను పుట్టింటికి పంపిస్తే ఖర్చని జంకాడు.

కానీ రామేశ్వరి ఇలా దెబ్బకొడుతుందనుకోలేదు.

ఈనెల కాలం అయ్యే ఖర్చు తలచుకుంటే నింగిలో చుక్కలు కనిపించసాగాయి కామేశ్వర్రావుకు. □